క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫణిగిరికాలనీ, పుష్పా గార్డెన్స్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మీర్‌పేటలో

మీర్‌పేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, నాగార్జునహిల్స్, వెంకటేశ్వర హిల్స్, చైతన్యహిల్స్, నందిహిల్స్ రోడ్ నెం-1 నుంచి 22 వరకు, ప్రశాంతిహిల్స్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ జనార్దన్‌రెడ్డి ఫీడర్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్, గాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, హనుమాన్‌నగర్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నోరు తెరిచిన మ్యాన్‌హోల్


శ్రీరాం కాలనీలో పైకప్పు లేని మ్యాన్‌హోల్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని బృందావన్ కాలనీలో మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదభరితంగా మారింది. 17వ వార్డు పరిధిలోకి వచ్చే ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ ఇలా నోరు తెరుచుకొని ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు అటుగా ఆడుకుంటూ వెళ్లి అందులో పడిపోయే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్న విషయమై సూచికగా స్థానికులు మ్యాన్‌హోల్‌లో కర్రను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రాత్రి పూట ఈ రూట్‌లో కొత్తవారు వచ్చినట్లయితే అందులో పడిపోయే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి వెంటనే పైకప్పును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి


బడంగ్‌పేట ప్రభుత్వ పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేటలోని జిల్లా ఉన్నత పాఠశాలలను బీజేపీ నాయకులు సోమవారం సందర్శించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను, క్లాస్‌రూంలో వసతులు తనిఖీ చేశారు. హెచ్‌ఎంలతో మాట్లాడిన అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మరుగుదొడ్ల సౌకర్యం లేక టీచర్ల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతులు కల్పించడంలో అధికారులు విఫలం చెందారన్నారు. సరైన వసతులు ఉంటేనే విద్యార్థులు చదువుల్లో రాణిస్తారన్నారు.. విద్యార్థులకు సరైనా వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నడికుడ యాదగిరి, మాజీ కార్పొరేటర్ గౌర రమాదేవి, రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, కుంటి భాస్కర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పడిపూజ


పడిపూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్, శివస్వాములు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి కమలా నెహ్రూనగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం మల్లికార్జునస్వామి జ్యోతిర్లింగ పడిపూజను శివస్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ హాజరై దాదాపు 30 మంది శివస్వామనులను శాలువాలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శివస్వాములు శ్రీశైలం క్షేత్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌ముదిరాజ్, దయానంద్, శివ గురుస్వామి, యాదగిరి ముదిరాజ్, కుమార్, మేకల కృష్ణ, శివశంకర్‌నేత తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు దేవాలయం ముస్తాబు

- రేపటి నుంచి వీరాంజనేయస్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


ముస్తాబైన వీరాంజనేయస్వామి దేవాలయం

మహేశ్వరం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి దేవాలయం ముస్తాబైంది. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 26 బుధవారం నుంచి 28వ తేదీ శుక్రవారం వరకు ఉత్సవాలు జరగనున్నాయని దేవాలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకుగాను భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. 26వ తేదీ బుధవారం ఉదయం సుప్రభాతం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భక్తులకు అర్చనాదులు నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు ప్రదోశ పూజ, అభిషేకం, హారతి, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. 27వ తేదీ గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి అగ్నిగుండములు నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతం, రుద్రాభిషేకం, భక్తులకు అర్చనాదులు నిర్వహిస్తారు. 28వ తేదీ శుక్రవారం సుప్రభాతం, మంత్రపుష్పం, సత్యనారాయణవ్రతాలు, అభిషేక కార్యక్రమాలు చేయనున్నారు. అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ట్రస్టీలు పేర్కొన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరు


ఆలయంలో కొలువుదీరిన శివుడు

కానున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవం, పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని ఆలయ సభ్యులు కోరారు.

వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఓంకారేశ్వరస్వామి ఆలయ సప్తదశ ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా ప్రతి ఏడాది మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సప్తదశ (17)వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఉత్సవ కమిటీ ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉత్సవాలు ఇలా...

ఈ నెల 25వ తేదీ(మంగళవారం) ఉదయం 6 గంటలకు సుప్రభాతము, స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, మూలమంత్ర దోషాలు, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు. 26వ తేదీ బుధవారం శివపార్వతుల కల్యాణం, ప్రత్యేక అలంకరణ, పలు పూజలు, స్వామి పల్లకీసేవ ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు. 27వ తేదీ గురువారం పూర్ణహుతి, భక్తులకు అన్నదానం, భద్రకాళీ పూజ, అగ్నిగుండములు నిర్వహిస్తారు. మూడురోజుల పాటు నిర్వహించే వేడుకలకు ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఆలయ చైర్మన్ భోద మాధవరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపలో పాత్రులు కావాలని కోరారు.


ముస్తాబైన ఓంకారేశ్వర స్వామి ఆలయం

సీసీరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్లు, నాయకులు

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయల వ్యయంతో శ్రీరాం కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టామని జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు కెంచె లక్ష్మీనారాయణ, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. రూ.50లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న శ్రీరాం కాలనీలోని ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాప్ వరకు సీసీ రోడ్డు, దిగువకు బీటీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షేక్ జహంగీరుద్దీన్‌తో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతం పదవిలో లేకున్నా ప్రజల మధ్యే ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్, మున్సిపాలిటీ సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కందుకూరు: లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు, విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని ముచ్చర్ల, ఊట్లపల్లి రైతులు సోమవారం ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అక్కడి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యిందన్నారు. ఏడాది కాలంగా లోఓల్టేజీ సమస్యతో బోరుమోటార్లు, స్టార్టర్లతో పాటు ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయని వాపోయారు. సమస్య పరిష్కరించకపోతే డీఈ కార్యాలయం ముందు ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గడ్డం మహిపాల్‌రెడ్డి, బండ నర్సింహ, కాస నర్సింహ, ఎం.రాజు, బుడ్డోని భిక్షపతి, టి.రాజు, కె.జంగయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతులు, గ్రామస్తులు

రంజాన్‌కు సౌకర్యాలు కల్పించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షల్లో ఉండే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా వార్డుల్లో చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామెద్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అఫ్జల్ కోరారు. ఈ మేరకు సోమవారం జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మజీద్‌ల పరిసరాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చెత్తాచెదారాలు లేకుండా చూడాలన్నారు. రహదారులపై నెలకొన్న గోతులను మొరంతో పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి పూట చాలా బస్తీలలో వీధి దీపాలు వెలగడం లేదని, వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా బోర్లను రిపేర్ చేసి.. అవసరమైతే వాటర్ ట్యాంకర్లతో కూడా నీటి సరఫరా చేయాలని కోరారు. ఆయనను కలిసి వారిలో నాయకులు అలీ మన్సూరీ, సయ్యద్ అబ్బాస్, ఆరీఫ్ అలీ, సలీం, అజీం, హఫీజ్ తదితరులు ఉన్నారు.

సైన్స్ టీచర్‌ను నియమించాలని వినతి

- నియామకంపై డీఈఓకు ఆదేశాలు జారీచేసిన కలెక్టర్

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని గ్రామ యువకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు నెలల నుంచి సైన్స్ టీచర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా సైన్స్ టీచర్ లేక పాఠాలు సక్రమంగా జరకపోవడంతో ఆ సబ్జెక్టులో విద్యార్థులు పూర్తిగా వెనకబడిపోతున్నారన్నారు. పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని పలుమార్లు ఎంఈఓ, డీఈఓలకు విన్నవించిన ప్రయోజనం లేదని గ్రామ యువకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సైన్స్ టీచర్‌ను నియమించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ డీఈఓతో మాట్లాడి పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు గ్రామ యువకులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ యువకులు కటికెల యాదగిరి, కళ్యాణ్‌రెడ్డి, కార్తీక్ పలువురు పాల్గొన్నారు.


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ యువకులు

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారి వేతనం రూ 26వేలు, శానిటరీ ఫీల్డ్ సహాయకులుగా పనిచేస్తున్న వారికి రూ.35వేలు, ఎండ తీవ్రత పెరిగినందున పారిశుద్ధ కార్మికులను ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకే పని చేయించాలన్నారు. గ్రేటర్ పరిధిలో సుమారుగా 26 వేల మంది కార్మికులు పనిచేస్తున్నా ఇప్పటి వరకు వారిని పర్మనెంట్ చేయలేదని తెలిపారు.

ఇరుకు కల్వర్టుకు మోక్షం


కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ–మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై ఇరుకుగా ఉన్న కల్వర్టు సమస్యకు పరిష్కారం వైపు అడుగులు పడ్డాయి. నిత్యం పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు సాగే ఈ రహదారిలో కల్వర్టు వద్ద ఒక బస్సు వచ్చిందంటే, మరో వాహనం పక్క నుంచి వెళ్లలేనంత ఇరుకుగా ఉంటుంది. ఈ విషయమై మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్ మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డును విస్తరించి నూతన కల్వర్టు నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5లక్షలు విడుదల చేశారు. కల్వర్టు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి.

ఆర్థికసాయం అందజేత


నగదు అందిస్తున్న సాలివీరా నాయక్

మహేశ్వరం: మండల పరిధిలోని గంగారం పంచాయతీ మైలార్‌బాయి తండాకు చెందిన మునావత్ లచ్చిరామ్‌నాయక్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ సర్పంచ్ ఎం.సాలివీరానాయక్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి చేసిందేమీ లేదు

వనస్థలిపురం: అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని చెప్పి కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా చేసిందేమీ లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు. సోమవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. సుధీర్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నారని జీఓ 118 పేరుతో పనికిరాని డాక్యుమెంట్ చేతిలో పెట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇసుక లారీల అడ్డాను టీజీఐఐసీ స్థలంలోకి తరలించి ఉచితంగా పార్కింగ్ సదుపాయం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు ప్రైవేటు వారికి ఆ స్థలాన్ని కేటాయించి లారీ యజమానులను మోసం చేశారని విమర్శించారు. సుధీర్‌రెడ్డి ఆరోగ్యంపై దుష్ప్రచారం చేసే దుర్బుద్ధి కాంగ్రెస్ నాయకులకు లేదని, అది బీఆర్‌ఎస్ నాయకులకే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.25, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.23, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.08.

కలెక్టరేట్‌కు తరలిన కార్మికులు

కందుకూరు: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్‌కు మండలం నుంచి పెద్దఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా 9, 10 తరగతుల విద్యార్థులకు వంట చేసిన బిల్లులు రాలేదన్నారు. కోడి గుడ్డు ధర బహిరంగ మార్కెట్‌లో రూ.7 నుంచి రూ.8 ఉండగా ప్రభుత్వం కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తుందన్నారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులపై ఆర్థికంగా భారంపడి నష్టపోతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన విధంగానే పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఒక్కో గుడ్డుకు రూ.10 చొప్పున ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. నెలకు రూ.10వేల చొప్పున వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, అశ్విని, గీత, బాలమణి, లక్ష్మమ్మ, కృష్ణవేణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కల్తీ పదార్థాలపై అవగాహన అవసరం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్

మహేశ్వరం: కల్తీ ఆహార పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగి రమేశ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మనం రోజు తినే వంట పదార్థాలు, కల్తీ ఆహార పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం తినే ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి కల్తీవా, మంచివా అనేది తెలుసుకోవాలన్నారు. కల్తీ ఆహార పదార్థాలను గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంతకుముందు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ఏవిధంగా గుర్తించాలి అనే అంశాలను ప్రయోగపూర్వకంగా అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల రసాయన శాఖ విభాగాధిపతి డా.దయానంద్, ఆహార కల్తీ నిర్ధారణ విభాగాధిపతి రిటైర్డ్ లక్ష్మీనారాయణ, డా.ఇంతియాజుద్దీన్, డా.ఫారుఖ్, సైన్స్ విభాగాల అధికారులు డా.చందన, డా.శ్రీదేవి, డా.నరేందర్‌రెడ్డి, డా.శ్రీహరిరెడ్డి, డా.జహీదాభేగం, డా.ఫర్‌నాజ్, డా.చెన్నోజీ, డా.గోపాల్, ప్రవళిక, సునీత, సుమతి, రమేశ్, సురేష్, సన్నీ పలువురు పాల్గొన్నారు.


ప్రయోగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, సైన్స్ అధికారులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


శిక్షణలో పాల్గొన్న ఏపీఎం, మహిళలు

చేవెళ్ల: మహిళలు పౌష్టికాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఏపీఎం శోభారాణి సూచించారు. చేవెళ్లలో మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు పౌష్టికాహారం(ఎఫ్‌ఎన్‌హెచ్‌డబ్ల్యూ)పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మహిళలు ప్రతీ రోజు ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, పండ్లు, పాలు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు 1000 రోజుల ప్రణాళిక అమలుచేస్తూ వారికి పౌష్టికాహారం అందించే కార్యక్రమం చేపడుతుందని దీనిని మహిళలు అందరూ గుర్తించాలన్నారు. దీంతో పాటు మహిళలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. మహిళలు మీరు నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో మహిళలకు తెలియజేయాలని సూచించారు.

ఆ అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల అధికారుల పనితీరుపై విజిలెన్స్ అధికారులు నిఘా వేయడంతో పాటు అధికారుల పనితీరుపై ఆరా తీస్తున్నారు. ఇటీవల పలు అధికారులు, సిబ్బంది పనితీరుపై గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో గ్రేటర్ కమిషనర్ ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల అధికారుల పనితీరుపై రోజు వారీగా విజిలెన్స్ అధికారులకు నివేదికలు అందించాలని ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు వారిపై నిఘా పెట్టి సమాచారం సేకరిస్తున్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, జనన మరణ ధ్రువపత్రాలు, ఎంటమాలజీ విభాగాలపై అధికంగా ఫిర్యాదులు ఉండడంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారనే పలువురు పేర్కొంటున్నారు.బర్త్ అండ్ డెత్ విభాగంలో వేల కొద్ది ఫైల్స్ పెండింగ్‌లో ఉండడం రోజు రోజుకు పెరుగుతుండడంతో రోజుల తరబడి కార్యాలయం చుట్టు తిరిగినా పని కాకపోవడంతో పలువురు అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేస్తుండగా మరి కొంత మంది మాత్రం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. శానిటేషన్ విభాగంలో ఎస్‌ఎఫ్‌ఏలే అంత తామే అనట్టు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుపులు అందిస్తే నిబంధనలు పక్కకు పెట్టి వెంటనే పత్రాలు జారీ చేస్తారు. ట్రేడ్, ఫుడ్ తదితర లైసెన్స్‌ల జారీలో శానిటేషన్ పనులు పక్కన పెట్టి లైసెన్స్‌ల జారీ దందాకు అధికారులు తెర లేపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌ఎఫ్‌ఏలు కార్మికుల నుంచి నెల నెల మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ఇటీవల కొంతమంది కార్మికులు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదులు చేసినట్లు సమాచారం . రోజు రోజుకు వస్తున్న ఫిర్యాదులకు అధికారులు తలలు పట్టుకుంటే వాటిపై దర్యాప్తులు విజిలెన్స్ అధికారులు నిఘా ఏర్పాటు చేసి ఆరా తీస్తున్నారు.

